సాక్షి
రంగారెడ్డి

శుక్రవారం । 25 । జూలై । 2025



పుట్ట గొడుగుల్లా..

జల్‌పల్లి మున్సిపాలిటీలో ఎలాంటి అనుమతులు లేకుండా పుట్ట గొడుగుల్లా అక్రమ పెద్ద నిర్మాణాలు కొనసాగుతున్నాయి. 8లో▸



వ్యసనాల బారిన పడొద్దు

వ్యసనాల బారిన పడొద్దని, గ్రామాల్లో మద్యం, గంజాయి విక్రయిస్తే చర్యలు తప్పవని ఏసీపీ రాజు హెచ్చరించారు. 8లో▸



విద్యారంగానికి పెద్దపీట

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి శుభముహూర్తాలు



మొయినాబాద్‌రూరల్: శుభకార్యాలకు నెలవైన శ్రావణమాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుండడంతో పెళ్లి భాజాలు మోగనున్నాయి. శభకార్యాలతో సందడి మొదలు కానుంది. ఈ నెల 26,30,31,ఆగస్టు 1,3,5,7,8,9,10,11, 12,13,14,17 తేదీల్లో శుభముహూర్తాలు ఉన్నట్లు సంగమేశ్వర దేవాలయం పురోహితుడు రాజేశ్వర శర్మ తెలిపారు. తిరిగి సెప్టెంబర్ 24, 26, 27, 28తో పాటు అక్టోబర్ 1,2,3,4,8,10,11,12,22,24,29,30,31 తేదీల్లో.. ఆ తర్వాత నవంబర్ 1,2,7,8,12, 13,15,22,23,26,27,29,30 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయని వివరించారు.

నేడు రైతులతో ముఖాముఖి

మొయినాబాద్: రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు ఎం.సునీల్ శుక్రవారం మొయినాబాద్‌కు రానున్నట్లు మండల వ్యవసాయాధికారి అనురాధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ, భూ సంబధిత చట్టాలపై అవగాహన కల్పించడంతోపాటు రైతులతో ముఖాముఖి చర్చించి క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోనున్నారని చెప్పారు. ఉదయం 7.30 గంటలకు మొయినాబాద్ రైతు వేదికలో జరిగే కార్యక్రమానికి ఆయన హాజరవుతారని తెలిపారు.

డయల్ యువర్ డీఎం నేడు

మహేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం 'డయల్ యువర్ డీఎం' నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ లక్ష్మీసుధ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు 91542 98784 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు అందించడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయాలని సూచించారు.

వైభవంగా పత్రీజీ స్మృతి స్మరణోత్సవాలు



శ్వాస పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆధ్యాత్మిక గురువులు

కడ్తాల్: మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహాపిరమిడ్‌లో గురువారం పత్రీజీ స్మృతి స్మరణోత్సవాలు ధ్యాన జనుల సందడి మధ్య వైభవంగా జరిగాయి. తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ఆధ్యాత్మికవేత్తలు, పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు తరలివచ్చారు. ధ్యానం విశిష్టత, ధ్యాన జగత్తు కోసం బ్రహ్మర్షి పత్రీజీ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మారెళ్ల రవిశాస్త్రి రచించిన శ్వాస (ది సోర్స్ ఆఫ్ లైఫ్) పుస్తకాన్ని సుమిత్రానంద సరస్వతి, ఎర్రప్రగడ రామకృష్ణ, పిరమిడ్ ట్రస్ట్ సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు. ధ్యానులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

కేజీబీవీలో తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీత

ఆమనగల్లు: పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, గిరిజన బాలికల వసతిగృహాన్ని గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.గీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా విద్యాలయాల్లో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన భోజనం, తరగతి గదులు, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. కేజీబీవీలో విద్యార్థులకు వండిన భోజనం నాణ్యతగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. స్టోర్‌రూం, విద్యార్థుల గదులు, మరుగుదొడ్లను వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారి పద్మజ్యోతి, ప్రభుత్వాస్పత్రి డాక్టర్లు మంజులాదేవి, మైమునా బేగం, సిబ్బంది తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా.. ఇయ్యండయ్యా!

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే పొలాలు దున్ని నాటుకు సిద్ధం చేసిన వారు పంటలు ఏపుగా పెరిగేందుకు ఎరువులు వాడుతుంటారు. డిమాండ్ మేర అందుబాటులో లేకపోవడంతో సగం బస్తాతో సరిపెడుతున్నారు. రైతులు తిరగబడే ప్రమాదం ఉందని భావించిన వ్యవసాయశాఖ ఆయా పంపిణీ కేంద్రాల వద్ద పోలీసు పహారా ఏర్పాటు చేసింది. ఉన్న కొద్దిపాటి నిల్వలను వారి భద్రత మధ్య సరఫరా చేస్తోంది.

ఎరువులకు ఒక్కసారిగా పెరిగిన డిమాండ్

- పంటల నిష్పత్తి మేర సరఫరా కాని వైనం
- ప్రాథమిక వ్యవసాయ కేంద్రాల వద్ద రైతుల క్యూ
- పోలీసు పహారాలో కొనసాగుతున్న సరఫరా



కేశంపేట: యూరియా కోసం క్యూలైన్‌లో ఉన్న రైతులు

వ్యవసాయశాఖ అంచనా (ఎకరాల్లో..)

పంట	విస్తీర్ణం
పత్తి	1,29,088
వరి	1,40,238
మొక్కజొన్న	62,207
కంది	9,008
జొన్న	2,762
వేరుశనగ	96
ఇతర పంటలు	4,590

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3,47,989 ఎకరాల విస్తీర్ణంలో పత్తి, వరి, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, కంది, ఇతర పంటలు సాగవుతున్నట్లు అంచనా. వర్షాకాలంలో 50 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, జూన్ ఆఖరి నాటికి 14,127 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యింది. కంపెనీలు, హోల్‌సేల్, ప్రైవేటు డీలర్ల వద్ద మరో 5,700 మెట్రిక్ టన్నుల యూరియా సహా 1,204 మెట్రిక్ టన్నుల డీఏపీ, 5,446 మెట్రిక్ టన్నుల ఇతర ఎరువులు నిల్వ ఉన్నట్లు జిల్లా వ్యవసాయశాఖ పేర్కొంది. డిమాండ్‌కు సరఫరాకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటాన్ని పలు వురు డీలర్లు/డిస్ట్రిబ్యూటర్లు అవకాశంగా తీసుకుంటున్నారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

కాంప్లెక్స్ ఎరువులపై అనాసక్తి

కొందుర్గు చౌదరిగూడ, షాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, మాడ్గుల, తలకొండపల్లి, కేశంపేట, ఫరూఖ్‌నగర్, ఆమనగల్లు, కడ్తాల్, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో పంటల సాగు ఎక్కువగా ఉంటుంది. డిమాండ్ ఉన్న మండలాలకు కాకుండా ఇతర మండలాల్లో ఎరువులు నిల్వ చేయడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కేశంపేట మండలంలో 20 వేల మంది రైతుల చేతుల్లో 34 వేల ఎకరాల భూమి ఉంది. వర్షాకాల సీజన్‌లో వీరికి 1,400 మెట్రిక్ టన్నులు అవసరం కాగా, ఇప్పటి వరకు 900 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయింది. ఆశించిన స్థాయిలో డీఏపీ దొరకకపోవడంతో ప్రత్యామ్నాయంగా కాంప్లెక్స్ ఎరువులు వాడాల్సిందిగా వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువుల వాడకంతో పంట ఏపుగా పెరగడం సంగతేమో కానీ తర్వాత చీడపీడల బెడద ఎక్కువగా ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆసక్తి చూపడం లేదు.

కొరవడిన నిఘా

ఎరువుల సరఫరా, నిల్వలపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేయాల్సిన వ్యవసాయశాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రైవేటు డీలర్లు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లు తయారైంది. మరోవైపు జిల్లాలో డిమాండ్‌కు మించి ఎరువుల నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని వ్యవసాయశాఖ ప్రకటిస్తుండడం విశేషం.

అదనంగా సరఫరా చేయండి



మార్క్‌ఫెడ్ జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: యూరియా కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అదనంగా సరఫరా చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో జీఎం విష్ణువర్ధన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. షాద్‌నగర్ నియోజకవర్గానికి 250 టన్నుల యూరియా సరఫరా చేయాలని వినతిపత్రంలో కోరారు. దీనికి స్పందించిన జీఎం తక్షణమే విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

ఉదయాన్నే ఉరుకులు, పరుగులు



క్యూలైన్‌లో ఉన్న మహిళా రైతులు

కేశంపేట: యూరియా కోసం రైతులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద గురువారం ఉదయమే క్యూ కట్టారు. పెద్దసంఖ్యలో తరలిరావడంతో కొద్దిగా తొక్కిసలాట జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని క్యూలైన్ ఏర్పాటుచేసి సాఫీగా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టారు. రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి శిరీష తెలిపారు. యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని సూచించారు.

6,770

- జిల్లాలో కొత్త రేషన్ కార్డులు
- మరో 1.48 లక్షల కార్డుల్లో పిల్లల పేర్ల నమోదు
- నేటి నుంచి లబ్ధిదారులకు పంపిణీ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పేదల ఆశలు నెరవేరబోతున్నాయి. ప్రజాపాలనలో భాగంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మందికి ఊరట లభించనుంది. జిల్లాలో కొత్తగా 6,770 మందికి రేషన్ కార్డులు మంజూరయ్యాయి. శుక్రవారం నుంచి లబ్ధిదారులకు వాటిని అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాదు 1.48 లక్షల కార్డుల్లో కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లు నమోదయ్యాయి. లబ్ధిదారులందరికీ త్వరలోనే ప్రభుత్వం అందించే ఉచిత సన్న బియ్యం అందనున్నాయి.

జంట జలాశయాలకు భారీ వరద



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారులోని హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్‌లకు వరద భారీ స్థాయిలో వచ్చి చేరుతోంది. హిమాయత్ సాగర్ జలాశయానికి వరద ఉద్ధృతి పెరిగింది. గురువారం సాయంత్రానికి జలాశయం పూర్తి నీటి మట్టానికి 1.45 దూరం చేరువలో ఉంది. మొత్తం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1,763.50 అడుగులు కాగా.. ప్రస్తుతం 1,761.05 అడుగులకు చేరింది. ఎగువ భాగం నుంచి జలాశయంలోకి 300 క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరుతోంది. ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉందని, మరో అడుగు మేర నీరు చేరితే గేట్లెత్తే అవకాశముందని జలమండలి అధికారులు తెలిపారు. మరోవైపు ఉస్మాన్ సాగర్ పూర్తి నీటి మట్టం 1,790 అడుగులు కాగా.. ప్రస్తుతం 1,782.80 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి 100 క్యూసెక్కుల మేర నీరు వచ్చి చేరుతోంది. హిమాయత్ సాగర్ జలాశయం ప్రాజెక్టు ఆరు గేట్ల నుంచి వాటర్ లీకేజీ అవుతుండటం గమనార్హం.

స్థానిక ఎన్నికలకు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌భూపాల్ గౌడ్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్

మహేశ్వరం: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మండల అధ్యక్షుడు టి.యాదీష్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో బీజేపీ అన్ని మండలాల్లో బలంగా ఉందని, లోక్‌సభ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో ఎంపీ అభ్యర్థులకు అత్యధికంగా ఓట్లు వచ్చాయని గుర్తు చేశారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్టా సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, రాష్ట్ర నాయకులు బస్వ పాపయ్య గౌడ్, కదారి జంగయ్య యాదవ్, అనంతయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్య గౌడ్, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగురవేయాలి

కందుకూరు: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజభూపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజభూపాల్‌గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎన్నికల ప్రభారి పాపారావు, జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములుయాదవ్, మండల ప్రభారి తూళ్ల వీరేందర్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎన్నికల కన్వీనర్ లక్ష్మణ్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు పల్లె కృష్ణగౌడ్, జిల్లా నాయకుడు జిట్టా రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఎనికేపల్లి భూముల్లో పనులు షురూ

- అధికారుల హామీతో దీక్ష విరమించిన రైతులు
- చదును చేసే పనులు మొదలుపెట్టిన అధికారులు

మొయినాబాద్: గోశాల ఏర్పాటుకు కేటాయించిన భూముల్లో ఎట్టకేలకు పనులు మొదలయ్యాయి. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి సర్వేనంబర్ 180లో 99.14 ఎకరాల భూమిని ప్రభుత్వం గోశాల ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఈ భూములను సాగుచేసుకుంటున్న రైతులకు పరిహారం విషయంలో అధికారులు, రైతులకు మధ్య జరిగిన చర్చలు మొదట్లో ఎటూ తేలకపోవడంతో 15 రోజులపాటు రిలే దీక్షలు చేపట్టారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు వారికి మద్దతుగా నిలిచాయి. ఎట్టకేలకు చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్‌కుమార్ బుధవారం చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో కలిసి రైతులతో చర్చించారు. ఎకరాకు 300 గజాల ఇంటి స్థలం, పార్కు, స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు స్థలం కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు దీక్ష విరమించారు. దీంతో గురువారం అధికారులు గోశాల భూములను చదునుచేసే పనులు మొదలుపెట్టారు. ముందుగా రైతులకు పరిహారంగా ఇచ్చే ఇంటి స్థలాలకు సంబంధించిన భూమిని చదును చేశారు. అక్కడే చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ చేతులమీదుగా తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేశారు. చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. రైతుల వివరాలు సేకరించి వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు.

కదిలించిన సాక్షి కథనం

- సుమోటోగా స్వీకరించిన లోకాయుక్త
- రాజు దీన స్థితిపై నివేదిక కోసం కలెక్టర్‌కు ఉత్తర్వులు

యాచారం: సాక్షిలో ఈ నెల 23న 'ఎమ్మెల్యే కలువకపాయె' శీర్షికన ప్రచురితమైన కథనాన్ని రాష్ట్ర లోకాయుక్త గురువారం సుమోటోగా స్వీకరించింది. మండల పరిధిలోని గునుగల్‌కు చెందిన మచ్చ రాజు(40)కు పక్షవాతం వచ్చి కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. కొన్నేళ్లుగా మంచానికే పరిమితమై వృద్ధురాలైన తల్లిపై ఆధారపడి జీవిస్తున్నాడు. పింఛన్ వస్తే ఆసరా అవుతుందని ఈ నెల 22న గ్రామానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వస్తున్నాడని తెలిసి సాయం కోరదామనుకున్నాడు. కలవడం సాధ్యం కాకపోవడంతో నిరాశతో వెనుదిరిగాడు. దీనిపై సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన రాష్ట్ర లోకాయుక్త సుమోటోగా తీసుకుని నివేదిక కోసం కలెక్టర్ నారాయణరెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు యాచారం ఎంపీడీఓ రాధారాణి గురువారం రాజును పరామర్శించారు. సదరం సర్టిఫికెట్ లేకే పింఛన్ మంజూరు కావడం లేదని, వెంటనే సర్టిఫికెట్ ఇప్పించేలా కృషి చేస్తామని అన్నారు.



సాక్షిలో ప్రచురితమైన కథనం

పాడిపశువుల సంరక్షణ ముఖ్యం

తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధకశాఖ విశ్రాంత డెరెక్టర్ లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

కడ్తాల్: పశుపోషణలో వాటి ఆరోగ్య సంరక్షణ ముఖ్యమని, పాడి పశువుల ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ వహిస్తే పాల ఉత్పత్తి తగ్గిపోయే ప్రమాదం ఉందని తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధకశాఖ విశ్రాంత డైరెక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో గురువారం తెలంగాణ పాడిపరిశ్రామిభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో నాణ్యమైన పాల సేకరణపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక పాల దిగుబడులు సాధించాలంటే పశువులకు కావల్సిన ఖనిజ ఆహార పదార్థాలను మేత ద్వారా అందించాలన్నారు. శాస్త్రీయ, యాజమాన్య పద్ధతిలో పాడిపోషణ చేపడితే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. షాద్‌నగర్ విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళి మాట్లాడుతూ.. నాణ్యమైన పాలను సేకరించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణయాదవ్ పాలను సేకరించే విధానం, నాణ్యత, నిల్వ చేయడం, రవాణా తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా విజయ డెయిరీ అధికారి భారతలక్ష్మి, కడ్తాల్, కొందుర్గు ఎంసీసీ మేనేజర్లు ప్రాణేశ్‌కుమార్, సురేశ్, మండల పశువైద్యాధికారి డాక్టర్ భానునాయక్, క్వాలిటీ అధికారి ఉదయశ్రీ, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

సమాచారశాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సమాచారశాఖ ప్రత్యేక కమిషనర్ సి.ప్రియాంక అన్నారు. ఈ మేరకు గురువారం నాంపల్లి ప్రెస్ అకాడమీలో ఏర్పాటు చేసిన జిల్లా జర్నలిస్టుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. జర్నలిస్టుల ప్రయోజనం కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను అందించడంలో మీడియా అకాడమీ ప్రముఖ పాత్ర పోషిస్తోందని, అకాడమీకి తాము అన్ని రకాల మద్దతు అందిస్తామని చెప్పారు. అకాడమీ ద్వారా మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు పెన్షన్ అందించడం, వారికి సహాయం చేయడం ద్వారా చాలామంది పిల్లల చదువుకు గొప్ప ఆర్థిక ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు. విధుల్లో ఉండి ప్రమాదాల్లో గాయపడి పని చేయలేని వారికి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల ప్రమాదాలకు గురై పని చేయలేని 180 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు అకాడమీ ప్రతి నెలా రూ.3వేల పెన్షన్, వారి పిల్లల ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు చదువుకు అవసరమైన ఫీజులను చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో దిశ ఎడిటర్ మార్కండేయ, సీనియర్ జర్నలిస్ట్ గోవిందరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పొందిన జర్నలిస్టులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజా సంబంధాల అధికారి పీసీ వెంకటేశం పాల్గొన్నారు.



శిక్షణ పొందిన జర్నలిస్టులకు సర్టిఫికెట్ల ప్రదానం

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మైసిగండి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అక్కడ రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం యూనిఫామ్స్, నైట్ డ్రెస్, స్పోర్ట్స్ డ్రెస్, నోట్, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు 200 శాతం, మెస్ చార్జీలు 40శాతం పెంచిందని గుర్తుచేశారు. పాఠశాల ఆవరణలో రూ.2.70 కోట్లతో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ పాఠశాలకు మైక్‌సెట్, క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పుట్ట గొడుగుల్లా అక్రమ నిర్మాణాలు



జల్‌పల్లిలో నిర్మిస్తున్న అక్రమ షెడ్లు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో ఎలాంటి అనుమతులు లేకుండా పుట్ట గొడుగుల్లా అక్రమ షెడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. 100 గజాల నుంచి 1,000 గజాల వరకు గుట్టు చప్పుడు కాకుండా షెడ్ల నిర్మాణాలు చేపట్టి అక్రమ వ్యాపారాలకు తెర తీస్తున్నారు. భారీ ప్రహరీలు, షెడ్ల నిర్మాణంతో పాటు అందులో నడిపే వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవడం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది. కానీ కొందరు కిందిస్థాయి సిబ్బంది వ్యాపారులతో కుమ్మక్కై మామూళ్లు తీసుకొని వీరికి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినవస్తున్నాయి. మున్సిపాలిటీ కార్యాలయం సమీపం నుంచి మొదలుకొని శ్రీరాం కాలనీ, కార్గో రోడ్డు పరిసరాలలో ఇలాంటి నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కనీసం ప్రమాణాలు కూడా పాటించకుండా ఏర్పాట్లు చేస్తున్న ఈ రేకుల షెడ్లతో ఏదైనా అగ్నిప్రమాదం జరిగినప్పుడు త్వరగా మంటలను కూడా అదుపు చేయలేని పరిస్థితి నెలకొంటుంది. ఈ విషయంలో మున్సిపాలిటీ ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

యువతి అదృశ్యం



నవ్య (ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడ మంఖాల్‌కు చెందిన చెన్నకేశవులు భార్య మాధవికి అనారోగ్యంగా ఉండడంతో నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం జకినాలపల్లి గ్రామానికి చెందిన చిన్నమ్మ పోలె రాములమ్మకు తెలపడంతో, తోడుగా ఉండేందుకు ఆమె కుమార్తె నవ్యను పంపించింది. ఆరోగ్యం కుదుట పడడంతో ఈ నెల 22న మధ్యాహ్నం నవ్యను మాధవి భర్త తుక్కుగూడ బస్టాప్‌లో డ్రాప్ చేసి వెళ్లిపోయాడు. కాగా సాయంత్రం వరకు కూడా ఆమె ఇంటికి చేరుకోకపోవడంతో తల్లి మాధవికి తెలిపింది. ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో బుధవారం రాత్రి పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



బాధితుడికి ఫోన్‌ను అందిస్తున్న పోలీసులు

కేశంపేట: రెండు నెలల క్రితం కేశంపేట గ్రామంలో జడ్చర్ల మండలంలోని ఎక్వాయపల్లి గ్రామానికి చెందిన శివ తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కేసు నమోదు చేశాడు. పోర్టల్‌లో ట్రాక్ చేయడంతో లభ్యమైన ఫోన్‌ను గురువారం సీఐ నరహరి బాధితుడికి అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్, కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి ఉన్నారు.

చిన్న తప్పిదం.. ప్రాణాలకు ప్రమాదం

భారీ వర్షాల వేళ చిన్న చిన్న తప్పిదాలతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కాస్తంత జాగ్రత్తలు పాటిస్తే వాటి నుంచి బయట పడొచ్చని విద్యుత్‌శాఖ అధికారులు తెలుపుతున్నారు.

వర్షాకాలం విద్యుత్‌తో జర భద్రం

- రైతులు, గృహ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



కడ్తాల్‌లోని ఓ వ్యవసాయ పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్



నరేందర్, విద్యుత్‌శాఖ, ఏఈ, కడ్తాల్

కడ్తాల్: వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని, సరైన జాగ్రత్తలు పాటించాలని ఆ శాఖ అధికారులు, సిబ్బంది సూచిస్తున్నారు. ప్రత్యేకించి వానలు పడేటప్పుడు చిన్నచిన్న పొరపాట్లతో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇళ్లు, పంట పొలాల్లో జాగ్రత్తలు పాటించక పోతే, ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి అనివార్యం అవుతుంది. ప్రస్తుతం వానలు పడుతుండడంతో రైతులు వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్ల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కడ్తాల్ విద్యుత్ ఏఈ నరేందర్ సూచిస్తున్నారు.

అవగాహన ముఖ్యం

విద్యుత్ ప్రమాదాలపై రైతులకు, ప్రజలకు విద్యుత్ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొన్ని చిన్న తప్పిదాలతో పెను ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరముంది. రైతులు వ్యవసాయ పొలాల్లో, ప్రజలకు ఇళ్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యం కల్పించాల్సిన అవశ్యకత ఉంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

- రైతులు తమ పొలాలను సాగు చేసుకునే క్రమంలో విద్యుత్ మోటార్లలో ఏదైన సమస్య తలెత్తితే వారే మరమ్మత్తులు చేసుకుంటారు. ఇలా చేయకుండా ఉండాలి.
- విద్యుత్ మోటార్లు వాడేటప్పుడు ఒక ఫేజ్ కాలిపోతే, మోటారు మొత్తానికి విద్యుత్ ప్రవహిస్తుంది. ఆ సమయంలో మోటారును తాకకుండా ఉండాలి.
- ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏబీ స్విచ్ పూర్తిగా నిలిచిపోతే విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదం సంభవిస్తుంది. ఈ సమయంలో రైతులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి, బాగు చేయించాలి.
- మోటార్‌కు ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. మోటారును పరిరక్షించాలంటే టెస్టర్‌ను వినియోగించాలి. వర్షానికి మోటారు తడవకుండా రేకు(గార్డు) అమర్చుకోవాలి. స్టార్టర్ స్విచ్ఛాఫ్ బోర్డు కూడా తడవకుండా చూసుకోవాలి.
- పంట పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లు, స్టార్టర్ బాక్సుల చుట్టూ పిచ్చి మొక్కలు, చెత్తచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.



పిచ్చి మొక్కల మధ్య ట్రాన్స్‌ఫార్మర్

- తెగిన విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అలాంటివి ఉంటే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.
- వర్షకాలంలో ఇనుప స్తంభాలను తాకవద్దు.
- ఇళ్ల వద్ద ఉతికిన బట్టలు ఆరేసుకునేందుకు ఇనుప తీగలను వినియోగించరాదు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినప్పుడు డిష్ కనెక్షన్ తీయాలి.
- విద్యుత్ తీగలు కిందకి వాలిన సమయంలో విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.
- రేకుల ఇళ్లు, తడిసిన గోడలను విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉంది. అక్కడ విద్యుత్ తీగలు తేలకుండా చూసుకోవాలి.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

కొత్తూరు: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొత్తూరు పట్టణంలో గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ తెలిపిన వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా తొత్తరమూడి గ్రామానికి చెందిన బొక్క సురేష్(17) ఇటీవల కొత్తూరు పట్టణంలోని రాఘవేంద్ర హోటల్‌లో పనిచేస్తున్న తన అన్న ప్రసాద్ వద్దకు వచ్చాడు. కాగా ఈ నెల 23న సాయంత్రం వేళలో అన్నకు చెప్పకుండా బయటకు వెళ్లి రైలు పట్టాలపై విగతజీవిగా పడి ఉన్నాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి మృతుడు ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. ఉదయం విషయం తెలుసుకున్న మృతుడి అన్న షాద్‌నగర్ ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించాడు. ఇటీవల మృతుడు బెట్టింగ్ యాప్‌ల కారణంగా అప్పుల పాలై ఆత్మహత్యకు పాల్పడ్డాడని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.


ఇంట్లో నుంచి వెళ్లి..

షాద్‌నగర్‌రూరల్: రైలు కింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి షాద్‌నగర్ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి గ్రామానికి చెందిన మంగళి శివకుమార్(35) ఇంట్లో నుంచి వెళ్లి, సోలీపూర్ గ్రామ శివారులోని పట్టాల పక్కన శవమై కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. శివకుమార్ మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కల్తీ కల్లు తాగి వ్యక్తి మృతి

మూసాపేట: కల్తీ కల్లు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లి, ఇందిరా హిల్స్‌కు చెందిన ఆడెబు విజయ్‌కుమార్ (35) రాపిడో బైక్ రైడర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న రాత్రి అతను సాయిచరణ్ కాలనీలో కల్లు తాగి ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత వాంతులు చేసుకోవడంతో మర్నాడు కేపీహెచ్‌బీలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు 8న గాంధీ ఆసుపత్రికి, అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



రాజేందర్ మృతదేహం

పోచారం: రైలు కిందపడి బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. యాదాద్రి జిల్లా, మానయిగూడెం గ్రామానికి చెందిన ఉప్పుల రాజేందర్ హాస్టల్‌లో ఉంటూ యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. గురువారం అతను స్థానిక రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



చింతుల్లలో వరినారు తీస్తున్న మహిళలు

జోరందుకున్న వరి నాట్లు

మునురు వర్షాలతో జిల్లాలో వరి నాట్లు జోరందుకున్నాయి. పొలాల్లో వర్షం నీరు నిల్వడంతో వ్యవసాయ బోరుబావుల్లోని కొద్దిపాటి నీటితో ట్రాక్టర్లతో చకచకా దున్నేస్తున్నారు. ఓ పక్క వరినాట్లు, మరో పక్క పత్తి పంటకు ఎరువులు వేసే పనులు ఊపందుకోవడంతో కూలీలకు భలే డిమాండ్ నెలకొంది. వరి నాట్లతో ఆయా గ్రామాల్లోని వ్యవసాయ పొలాలు పచ్చగా ఆకట్టుకుంటున్నాయి. – యాచారం



నక్కర్తమేడిపల్లిలో వరినాట్లు

రైతు సంక్షేమానికి కృషి

మార్కెట్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రైతు సంక్షేమానికి కృషి చేస్తామని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో పాలకవర్గంతో ఏర్పాటు చేసిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బత్తాయి, డ్రాగన్, ఆపిల్ సీజన్ సందర్భంగా ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని సూచించారు. ఈ సంవత్సరం మామిడి సీజన్‌ను అధిగమించామని, మునుపెన్నడూ లేని విధంగా 1,51,000 మెట్రిక్ టన్నుల మామిడి మార్కెట్‌కు వచ్చిందని తెలిపారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ సారి 40 వేల మెట్రిక్ టన్నులు అధికంగా వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, వైస్ చైర్మన్ భాస్కర చారి, డైరెక్టర్లు అంజయ్య, మధుసూదన్ రావు, నవరాజ్, జైపాల్ రెడ్డి, లక్ష్మి, రఘుపతి రెడ్డి, గణేశ్ నాయక్, నర్సింహ, మచ్చేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిలుక మధుసూదన్‌రెడ్డి

ప్రేమ జంటకు ఆశ్రయమిచ్చిన యువతీ యువకుల అరెస్టు

ఫిలింనగర్: ప్రేమ జంటకు ఆశ్రయం ఇచ్చినందుకు యువతీ, యువకులను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే ప్రేమజంట మధ్య విభేదాలు రావడంతో సదరు బాలిక ఫిలింనగర్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు ఆమె మైనర్ కావడంతో ఆమె ప్రియుడిని ఫోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణలో భాగంగా బాధితురాలు తమకు ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్‌లో నివసించే కోనె అఖిల్ అనే యువకుడు తన గదిలో ఆశ్రయం ఇచ్చినట్లు చెప్పింది. దీంతో బాలికతో పాటు ఆమె ప్రియుడికి చట్టవిరుద్ధంగా గదిని ఇచ్చినందుకుగాను పోలీసులు కోనె అఖిల్, అతడికి సహాయపడిన నిఖిత అనే యువతిని గురువారం అరెస్టు చేశారు. బీజేఆర్‌నగర్ బస్తీకి చెందిన యువకుడు, మైనర్ బాలిక ప్రేమించుకున్నారు. వీరిద్దరూ తరచూ కలుసుకునేందుకు అఖిల్ పలుమార్లు తన గదిని ఇచ్చాడు. అంతేగాక ఇదే బస్తీలో నివసించే నిఖిత అనే యువతి కూడా వీరికి పలుమార్లు ఆశ్రయం కల్పించింది. ఇలా గదులు ఇవ్వడం చట్టవిరుద్ధం కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు గదులు ఇచ్చిన వారిని కూడా నిందితులుగా చేర్చి అరెస్టు చేశారు. బస్తీల్లో, కాలనీల్లో, అపార్ట్‌మెంట్లలో ఎవరైనా స్నేహితులకు తమ గదులను ఇస్తే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం హెచ్చరించారు. ముఖ్యంగా ఫిలింనగర్ 18 బస్తీల్లో కొందరు ప్రేమ జంటలకు తమ గదులను వాడుకునేందుకు ఇస్తున్నట్లుగా ఫిర్యాదులు అందుతున్నాయని, వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. ఇళ్ల యజమానులు తమ ఇళ్లల్లో అద్దెకు ఉంటున్న వారి ఇంటికి ఎవరు వస్తున్నారో.. ఎవరు వెళ్తున్నారో తెలుసుకుని అనుమానాస్పదంగా ఉంటే బయటకు పంపించాలని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

గంజాయి మత్తులో యువత చిత్తు

పహాడీషరీఫ్: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలంటూ ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు చేస్తున్నా నగర శివారుగా ఉన్న జల్‌పల్లి మున్సిపాలిటీగా గంజాయి గుప్పుమంటుంది. పహాడీషరీఫ్, బాలాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోకి వచ్చే ఈ మున్సిపాలిటీ పరిధిలో రాత్రయ్యిందంటే యువకులు బస్తీ చబుత్రాలలో తిష్ట వేస్తూ ఎంచక్కా గంజాయి పీల్చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నారు. జల్‌పల్లి, పహాడీషరీఫ్, శ్రీరాం కాలనీ, వాదే ముస్తఫా, వాదే సాల్హె హీన్, షాహిన్‌నగర్, ఎర్రకుంట, ఉస్మాన్‌నగర్ తదితర బస్తీలలో రాత్రి పూట యువకులు గ్రూపులు గ్రూపులుగా జతకట్టి గంజాయి తాగుతూ బస్తీవాసులను భయాందోళనలకు గురి చేస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నించేందుకు ప్రయత్నిస్తే భౌతిక దాడులకు తెగబడుతున్నారు. వాదే ముస్తఫా బస్తీలోని మునీర్ మజీద్ పరిసరాలలో గంజాయి సేవిస్తున్న వారితో కొందరు స్థానికంగా ఇళ్లు సైతం ఖాళీ చేసి పోతున్నారని స్థానికులు తెలిపారు. అప్పుడప్పుడు పోలీసులు పెట్రోలింగ్‌కు వచ్చిన ఐదు, పది నిమిషాల పాటు వారికి చిక్కకుండా ఉండి, వారు వెళ్లాక తిరిగి బస్తీలలో న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారు. గంజాయి మత్తులో ఒక్కోసారి హత్యలు, హత్యాయత్నాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి బస్తీలలో గంజాయి వినియోగదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి



కూలీని పరీక్షిస్తున్న 108 సిబ్బంది

కొత్తూరు: పరిశ్రమకు కొత్తగా విద్యుత్ లైను ఏర్పాటు చేసేందుకు స్తంభాలు పాతుతున్న ఓ కూలీ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు పారిశ్రామికవాడలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పారిశ్రామికవాడలో ఉన్న ఓ బేకరి పరిశ్రమకు కొత్తగా విద్యుత్‌లైను వేసేందుకు పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా విజయలక్ష్మి ధర్మకంట సమీపంలో స్తంభాలు పాతే క్రమంలో పక్కనుంచి వెళ్లిన విద్యుత్ తీగలు తగలడంతో ఒక్కసారిగా షాక్ కొట్టి జనగామ జిల్లాకు చెందిన మహేందర్(26) తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది కూలీకి సీపీఆర్ చేసి షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యసనాల బారిన పడొద్దు

ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు



తక్కళ్లపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ రాజు

యాచారం: వ్యసనాల బారిన పడొద్దని, గ్రామాల్లో మద్యం, గంజాయి విక్రయిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరించారు. మండల పరిధిలోని తక్కళ్లపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం ఆయన పర్యటించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంత కష్టపడైన పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఉన్నత లక్ష్యంగా చదువుకోవాలని, ఉద్యోగాలు సాధించి ఊరికి మంచి పేరు తెచ్చిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంతోష, మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, అల్ఫ్రాజోలం పట్టివేత

కుత్బుల్లాపూర్: గంజాయి, అల్ఫ్రాజోలం విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దీన్ కథనం మేరకు.. మహారాష్ట్ర పర్లీ–వైద్యనాథ్‌కు చెందిన మజ్లూమ్ ఖురేషి, అబ్దుల్ రహమాన్ బైక్‌పై 10 కేజీల గంజాయిని కూకట్‌పల్లికి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు గంజాయిని సరఫరా చేసిన వసీమ్ పై కేసు నమోదు చేశారు. ఫిరోజ్‌గూడకు చెందిన రాగుల సాయికుమార్‌కారులో 2.5 కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన సంగారెడ్డి జిల్లా ముస్లాపూర్‌కు చెందిన బాల్‌రాజ్‌ను అదుపులోకి తీసుకుని అతడి నుంచి 140 గ్రాముల అల్ఫ్రాజోలం స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలు, వాహనాలు, మొబైల్ ఫోన్ల విలువ రూ. 7.20 లక్షలు ఉంటుందని షేక్ ఫయాజుద్దీన్ తెలిపారు. దాడుల్లో సీఐ నర్సిరెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది సత్తార్, సంజయ్, మున్నాఫ్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, చెన్నయ్యలు పాల్గొన్నారు.